అక్షయ్ గుప్త ఓ అద్భుత సాంకేతిక నిపుణుడు. అమెజాన్ నుంచి వచ్చిన భారీ ఆఫర్‌ను తిరస్కరించి మరీ తన స్టార్టప్ కలల వైపు అడుగులు వేశాడు. వృద్ధులకు సాయపడేలా ఫుట్‌బిట్ అనే సదుపాయం తెచ్చాడు. సత్యనాదెళ్ల సైతం అతణ్ని మెచ్చుకున్నాడు. ఓ రోజు అక్షయ్ బస్సులో ప్రయాణిస్తుండగా... పక్క సీట్లో కూర్చున్న వ్యక్తి అకస్మాత్తుగా దాడి చేశాడు. కత్తితో మెడ మీద పొడిచిపారేశాడు. వైద్యం అందించే సమయం కూడా లేకపోయింది. అక్షయ్ చనిపోయాడు. ఆ హంతకుడు మాత్రం ఏమీ ఎరగనట్టు చక్కగా లేచి బస్సు దిగిపోయాడు. కాసేపటికే అతణ్ని పట్టుకున్నారు. అతను కూడా భారతీయుడే. పేరు దీపక్. తన నుంచి ఆ హత్యకు కారణం విన్నవాళ్ల మతిపోయినంత పనయ్యింది.

కవర్ స్టోరీ



# కట్టు తప్పుతున్న మనిషి

వ్యక్తిగత కక్షలో, ఈర్ష్యాద్వేషాలో, వివాహేతర సంబంధాలో ఈ హత్యకు కారణం కానే కాదు. దీపక్‌కి తన మామ అంటే విపరీతమైన ద్వేషం. అక్షయ్‌కి ఆ పోలికలు ఉండటంతో... ఆ ద్వేషాన్ని తన మీద చూపించాడట!!! ఏకంగా ఉసురే తీశాడు. ద్వేషంలో మనుషులు ఎంతలా విచక్షణ తప్పుతున్నారో చెబుతున్న సంఘటన ఇది. సమాజంలో ఇలాంటి ధోరణులు పెరుగుతున్నాయనే భయానికి సూచన ఇది. పశువు నుంచి వచ్చిన మనిషి, తన విచక్షణ కోల్పోయినప్పుడు అదే పశువులా ప్రవర్తిస్తాడు. అదేం కొత్త కాదు. నైతిక విలువలు, పశ్చాత్తాపం, సిగ్గు, చట్టం అంటే భయం, సాటి మనుషుల పట్ల గౌరవం... ఇవన్నీ కూడా ఓ కట్టులాగా పనిచేస్తాయి. కానీ మనిషి ఆ కట్టు దాటుతున్నాడేమో అన్న సంశయం మొదలైంది. ఇది నిజమేనా!

... కె.సహస్ర